# ఇసుక లేక.. ఆన్‌లైన్ రాక

- ఇసుక కొరతతో రెండు నెలలుగా నిలిచిన రేగట్టే రీచ్
- ఇబ్బందులు పడుతున్న ట్రాక్టర్ యజమానులు


ఇసుక ఆన్‌లైన్ లేక ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు

**కనగల్ :** తెలంగాణ ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు తీసుకువచ్చిన సాండ్ ట్యాక్స్ పాలసీ విధానం కొన్ని ఇసుక రీచ్‌లకు వరంగా మారినా.. రేగట్టే ఇసుక రీచ్‌కు మాత్రం శాపంగా మారింది. మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వాగు పరివాహక ప్రాంతాలు ఉన్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలోని పర్వతగిరి, కనగల్, శేరిలింగోటం, బోయినపల్లి, బుడుమర్లపల్లి, రేగట్టే గ్రామాల్లో సాండ్ ట్యాక్స్ పాలసీ ద్వారా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. సాండ్ ట్యాక్స్ అమలైన తర్వాత గ్రామాల్లో 90శాతం మేర అక్రమ ఇసుక రవాణాకు అడుకట్టపడింది. గతంలో గ్రామానికి ఇద్దరు, ముగ్గురు దళారులు మాత్రమే సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతూ రాత్రింబవళ్లు నల్లగొండ పట్టణానికి ఇసుకను తరలించే వారు. ఇప్పుడు ఈ రీచ్‌ల ద్వారా సామాన్య రైతు కూడా ఇసుక ట్రాక్టర్ కొనుకుని ఇసుకను అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు. సక్రమంగా రెండు ఏళ్లు గడవక ముందే మండలంలోని రేగట్టే రీచ్ బంద్ కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రేగట్టే రీచ్‌లో ఇసుక కొరత..**

అన్ని గ్రామాల్లో ఇసుక రీచ్‌లో జోరుగా సాగుతున్నా రేగట్టే రీచ్‌లో మాత్రం ఇసుక లేకపోవడంతో గత రెండు నెలల నుంచి ఆన్‌లైన్ రావడం లేదు. రీచ్ ప్రారంభంలో జోరుగా సాగినా.. తర్వాత తర్వాత ఇసుక కొరత ఏర్పడి నానా ఇబ్బందులు పడి తోడారు. అదికాస్తా కూడా దొరక్కపోవడంతో చేసేదేమి లేక చివరికి ఆన్‌లైన్‌ను సంబంధిత అధికారులు నిలుపుదల చేశారు.

**శాబ్దుల్లాపురంలో ఇసుక ఉన్నా...**

రేగట్టే ఇసుక రీచ్ పరిధిలో శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన 30ట్రాక్టర్లు ఉన్నాయి. ఈ గ్రామంలో ఇసుక సమృద్ధిగా ఉన్న వారికి శాపంగా మారింది. రేగట్టే గ్రామంలో ఇసుక కొరత ఉండటంతో ఆ గ్రామానికి చెందిన ట్రాక్టర్లను హోల్డ్‌లో పెట్టిస్తే ఈ గ్రామానికి చెందిన ట్రాక్టర్లు నడిచే అవకాశం ఉంది. కానీ రేగట్టే ఇసుక రీచ్ పరిధిలో ట్రాక్టర్ల యజమానులు ఒప్పుకోవడం లేదని వారు వాపోతున్నారు.

**రేగట్టే ఇసుక రీచ్ పరిధిలో 150ట్రాక్టర్లు..**

మండలంలోని రేగట్టే, శాబ్దుల్లాపురం గ్రామాల పరిధిలోని రీచ్‌లో 150ట్రాక్టర్లు సాండ్ ట్యాక్స్ ద్వారా నమోదై ఉన్నాయి. వీరు ఆన్‌లైన్ వచ్చినప్పుడల్లా నల్లగొండ పట్టణానికి ఇసుకను తోడుకుని వస్తారు. ఇసుక ఆన్‌లైన్‌తో రూ.లక్షలు వెచ్చించి ట్రాక్టర్లు కొన్నారు. కాని ఇప్పుడు రీచ్ బంద్‌కావడంతో ఇంటి వద్దే ఉండటంతో వారు ట్రాక్టర్ కిస్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఇప్పటికే 20ట్రాక్టర్లను అమ్ముకున్నారు.

**ట్రాక్టర్లు నడిచే విధంగా చూడాలి**



ఆన్‌లైన్ ఇసుక ఆశతో డబ్బులు లేకున్నా ఫైనాన్స్‌లో తెచ్చి మరి ట్రాక్టర్ కొన్నా. తీరా చూస్తే రేగట్టే పేరిట ఉన్న రీచ్‌లో ఇసుక లేమి కారణంతో ఆన్‌లైన్ నిలిచిపోయింది. కానీ మా గ్రామంలో ఇసుక ఉన్న కొట్టుకోలేని పరిస్థితి దాపురించింది. లక్షలు పెట్టి కొన్న ట్రాక్టర్ నెలల కొద్ది ఇంటి వద్ద ఉంటున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకుని మా గ్రామంలో ఇసుక ఆన్‌లైన్ అమలు అయ్యేటట్లు చూడాలి. లేకపోతే ప్రత్యామ్నాయంగా సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లో మా 30ట్రాక్టర్లను కలపాలి.

– కారింగు శంకర్, ట్రాక్టర్ యజమాని, శాబ్దుల్లాపురం

**మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు**



సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడాము. సమస్యను మూడు రోజుల్లో పరిష్కరించి శాబ్దుల్లాపురం పరిధిలో ఇసుక ట్రాక్టర్లు నడిచే విధంగా అధికారులు చూస్తామన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.

– దాసిరెడ్డి జ్యోతిరవీందర్‌రెడ్డి, సర్పంచ్, శాబ్దుల్లాపురం

# పట్టణంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, క్రైస్తవులు తదితరులు

**రామగిరి(నల్లగొండ) :** పట్టణంలో క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవరకొండ రోడ్డులోని మరియరాణి చర్చి నుంచి నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీలో ఆయన పాల్గొని కొద్దిదూరం నడిచారు. ఆయనతో పాటు తీగల జాన్‌శాస్త్రి, టిస్.క్రిస్టోఫర్, ఎస్.జయప్రకాష్, పసల శౌరయ్య, జెన్‌టీ.ఎలిషా, ఎస్.ఆనంద్‌ప్రకాష్, డాక్టర్ డెవిడ్‌రాజ్, డాక్టర్ శరత్‌చంద్రరాజ్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి

**మునుగోడు :** వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ఉపాధిహామీ కూలీలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలకు రోజుకు రూ.600 కూలీతో పాటు పెండింగ్ కూలీ డబ్బులు చెల్లించాలని, అదే విధంగా ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి ఒక్కోకరికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం సహాయం అందించాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాగితం వెంకన్న తదితరులు ఉన్నారు.

**10న కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**చిట్యాల :** ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను, పనిదినాల పెంపు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి దుబ్బ విఘ్నేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో కూలీలతో పాటు, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### నేడు నర్రా రాఘవరెడ్డి వర్ధంతి

**చిట్యాల :** మండలంలోని వట్టిమర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి వర్ధంతిని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 10న పెన్షనర్ల నిరసన దీక్ష

**నల్లగొండ టూటౌన్ :** పెన్షన్‌దారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, స్పెషల్ టీచర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మెరుగైన వైద్యచికిత్స అందించి, ఆదాయ పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ కంది భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షలో పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా జెర్రిపోతుల భరత్‌గౌడ్



**నార్కట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా జెర్రిపోతుల భరత్ గౌడ్ శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు భరత్‌గౌడ్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ఉద్యమిస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

### సిటిజన్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఐటీఐలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దేవేందర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లీఖార్జున్ మాట్లాడుతూ.. అసోసియేషన్ బలోపేతానికి, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషిచేయాలని ఆయన కోరారు.

### మృతురాలి కుటుంబానికి జెడ్పీటీసీ పరామర్శ

**కట్టంగూర్ :** మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన కావెటి సత్తెమ్మ(59) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ తరాల బలరాములు సత్తెమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, ఎంపీటీసీ నల్లమాద మహాలక్ష్మిసైదులు, చెవుగోని నాగరాజు, ప్రభాకర్, యాదయ్య, గోలి శివ తదితరులు ఉన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

**నల్లగొండ టూటౌన్ :** పట్టణంలో నేడు (ఆదివారం) బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని డీవీకే రోడ్డులోని రెడ్డిహాస్టల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, జెడ్పీచైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకుడు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణంలోని పెద్దగడియారం సెంటర్ నుంచి ర్యాలీగా రెడ్డి హాస్టల్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు.

**మర్రిగూడ :** మండల కేంద్రంలో నేడు (ఆదివారం) బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ తెలిపారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి మండల పరిధిలోని తిరగండ్లపల్లి, యరగండ్లపల్లి, మర్రిగూడ, వట్టిపల్లి, దామెరభీమనపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

### రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎంపీ వెంకట్‌రెడ్డి

**నార్కట్‌పల్లి :** మండలంలోని కొండపాకగూడెం నుంచి బ్రహ్మణవెల్లెంల వరకు గల మెటల్ రోడ్డు నిర్మాణానికి భువనగిరి ఎంపీ కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేసి శనివారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య, కొండపాక గూడెం సర్పంచ్ కె.మల్లేశం, వి.శంకర్, నల్లబోతు సత్తయ్య తదితరులున్నారు.

## ‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**నార్కట్‌పల్లి :** పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, ఎస్‌పీఆర్, శ్రీచైతన్య పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలతో పాటు జెడ్పీ పాఠశాల బ్రహ్మణ వెల్లంల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణపై ఉద్యోగ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట స్థానిక తహసీల్దార్ సైదులు, ఆర్ఐ తరుణ్, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

**పరీక్ష కేంద్రాల తనిఖీ**

**చిట్యాల :** పట్టణంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా తనిఖీ చేశారు. జెడ్పీహెచ్‌ఎస్, గ్రీన్‌గ్రోవ్, లీటిల్‌ఫ్లవర్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట చిట్యాల మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్ తదితరులున్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న తుమ్మల నాగరాజురెడ్డి

**చిట్యాల :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేసినప్పుడు బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ విభాగం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువజన విభాగంలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గెలుపు కోసం పనిచేయాలన్నారు. సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు చిత్రగంటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు జోగు శ్రీకాంత్, నాయకులు ఎస్‌కె.యాసీన్, గణేష్, వంశీ, రాజేష్, చింటు, నాని, నరేష్ పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవనానికి స్థలం విరాళం


సర్పంచ్‌కు స్థల పత్రాలను అందజేస్తున్న ప్రమీల

**శాలిగౌరారం :** మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన చాడ ప్రమీల తనభర్త చాడ నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.5లక్షల విలువైన 300 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. శనివారం సర్పంచ్ బండారు శంకర్‌కు స్థలానికి సంబంధించిన పత్రాన్ని అందజేశారు. కొంతకాలంగా గ్రామంలో నిరుపయోగంగా ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు నీటివినియోగదారుల సంఘం భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి పరిపాలనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలకు భవనాల కోసం నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చేందుకు ప్రమీల ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, నిమ్మల సాయిబాబా, నర్సింహ, సత్తెనపల్లి శ్రీను, నిమ్మల శ్రీనివాస్, వీరస్వామి, కుమార్, సైదులు, వెంకన్న, పరమేశ్, జితేందర్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ నర్సింహారెడ్డి

**నల్లగొండ క్రైం :** చలివేంద్రాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జగిని వస్త్రాలయం, డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జగిని సంస్థల అధినేత జగిని వెంకన్న, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, యామ దయాకర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**మర్రిగూడ :** మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మహ్మద్ హకీమ్ కుమారుడు అస్లత్ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అస్లత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, సర్పంచ్ నల్ల యాదయ్య, రైతుబంధు కన్వీనర్ బచ్చు రామకృష్ణ, ఎంపీటీసీ సిలివేరు విష్ణు, పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్య, నాయకులు పందుల రాములుగౌడ్, కొలుకులపల్లి యాదయ్య, వెంకటయ్య, యాదగిరి, దేవేందర్, భాస్కర్, కృష్ణ, రవిగౌడ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

### కబడ్డీ పోటీల నిర్వహణపై ఎమ్మెల్యేకు వినతి

**నల్లగొండ టూటౌన్ :** బీఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు శనివారం మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకుడు పెరిక కరణ్‌జయరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పోటీలకు ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేసినట్లు కరణజయరాజ్, ఛత్రపతి శివాజీ కబడ్డీ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు.

### యాత్రను విజయవంతం చేయాలి

**చండూరు :** రైతుల న్యాయ అవసరాలు, భూమి ఆకాంక్షలు తెలుసుకోవడానికి లీప్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే యాత్రను విజయవంతం చేయాలని ఆ సంస్థ సలహాదారుడు కరుణాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. యాత్ర ఈనెల 10న యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం నుంచి బయలుదేరి చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, మునుగోడు, చండూరు, నాంపల్లి, మల్లేపల్లి వరకు కొనసాగుతుందన్నారు.

## మోదీ పర్యటనను నిరసిస్తూ ఆందోళన


చిట్యాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**చిట్యాల :** భారత ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు శనివారం నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాభివృద్ధిపై వివక్ష చూపుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, మండల నాయకులు నారబోయిన శ్రీనువాసులు, శీలా రాజయ్య, నర్సింహ, రుద్రారపు పెద్దులు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన**


నకిరేకల్ : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**నకిరేకల్ :** తెలంగాణలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో పర్యటించే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాయకులు బచ్చుపల్లి ప్రకాశరావు, యానాల కృష్ణారెడ్డి, వంటిపాక కృష్ణ, బక్కయ్య, ఆదిమల్ల సుధీర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్ సర్వీస్‌ను వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎం రఘు

**చండూరు(గట్టుప్పల) :** మండలంలోని ఆయా గ్రామాల ప్రజల అవసరాల కోసం గట్టుప్పల్ నుంచి దిల్‌షుక్‌నగర్ వరకు ఆర్టీసీ బస్‌సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ సేవలను వినియోగించుకోవాలని హయత్‌నగర్-1 డిపో మేనేజర్ రఘు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల నుంచి ఉదయం 5.15నిమిషాలకు, 9.30నిమిషాలకు, సాయంత్రం 3.00గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఇదే విధంగా దిల్‌షుక్‌నగర్ నుంచి ఉదయం 7.30నిమిషాలకు మధ్యాహ్నం 3.00గంటలకు సాయంత్రం 7.15నిమిషాలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం, మాజీ సర్పంచ్ ముత్తిరెడ్డి, మేనేజర్ శంకరయ్య ఉన్నారు.

### జ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటీ నియామకం

**నల్లగొండ టూటౌన్ :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించనున్న జ్యోతి బాపూలే జయంతి వేడుకల రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

**కమిటీ వైస్‌చైర్మన్‌గా మోదిరాందేవ్**

**నార్కట్‌పల్లి :** మండలానికి చెందిన పల్లగొర్ల మోదీరాందేవ్‌ను ఈనెల 11న జరగనున్న మహాత్మా జ్యోతిరావ్‌ఫూలే జయంతి ఉత్సవ కమిటీ వైస్‌చైర్మన్‌గా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మోదీ రాందేవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించే జ్యోతిరావ్‌ఫూలే జయంతి ఉత్సవాలకు వైస్‌చైర్మన్ నియమించడం పట్ల సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బీసీ ఫ్రంట్ చైర్మన్ గోరిగే మల్లేష్‌యాదవ్, బీసీ సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ, అంజి, సతీష్ ఉన్నారు.

**పూలే జయంతి కోకన్వీనర్‌గా అంజయ్య**

**శాలిగౌరారం :** ఈనెల 11న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న ఉత్సవాలకు ఉత్సవ కమిటీ కోకన్వీనర్‌గా రజక ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండల కేంద్రానికి చెందిన తాందారు అంజయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అంజయ్య శనివారం స్థానికంగా విలేకరులకు వెల్లడించారు.

## నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


చిట్యాలలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు


నకిరేకల్ : దీక్ష చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

**చిట్యాల :** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పోకల అశోక్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌టీపీ పార్టీ నిరుద్యోగుల పక్షాన నిరంతర పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పోకల దామోదర్ చిట్యాల, రామన్నపేట, కట్టంగూర్ మండల అధ్యక్షులు పల్లె రాజేందర్‌గౌడ్, మేడబోయిన వెంకటేశ్వర్‌యాదవ్, పి.సురేష్‌కుమార్, నాయకులు మహేష్ యాదవ్, నర్సింహ, రాజేష్, అశోక్, లింగయ్య, దాసరి టోని తదితరులు పాల్గొన్నారు.

**పేపర్ లీకేజీలపై నిరాహార దీక్ష**

**నకిరేకల్ :** తెలంగాణలో జరుగుతున్న పేపర్ లీకేజీలపై వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యలయం ఎదుట శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోమ్ము శోభ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుపై పార్టీ ఆధ్వర్యంలో వరుస పోరాటాలు చేస్తామన్నారు. దీక్షలో గుండు కర్ణాకర్‌గౌడ్, ఏర్పుల వీరేందర్, మంద మనోజ్, ఇంద్రమ్మ, మాచర్ల లక్ష్మి, సుగణ, లావణ్య, ఈరమ్మ తదితరులు ఉన్నారు.

### ఊరూరా ‘బలగం’ ప్రదర్శన

**శాలిగౌరారం :** మండలంలో ఆకారం, జాలోనిగూడెం, శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని పావురాలగూడెం గ్రామంలో అభిమానులు శనివారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు.

**రాంరెడ్డిపల్లిలో..**

**మర్రిగూడ :** మండల పరిధిలోని రాంరెడ్డిపల్లిలో యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని మహిళలు చిత్రాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బేత వెంకటేష్, నగేష్, కొండప్ప, వెంకటేష్, కిరణ్, నర్సింహ, శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

### సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మంగారెడ్డి

**రామగిరి(నల్లగొండ) :** పట్టణంలోని ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు సైన్స్ ఒలింపియాడ్ సెకండ్ లెవెల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. నేషనల్ సైన్స్ ఒలింపియాడ్, ఇంటర్‌నేషనల్ సోషల్ సైన్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఎస్.సాయి తనీష్ 10, జె.శ్రీశాంత్ 11, ఎస్.రాహుల్ సూరజ్ 22, సీహెచ్.అనిరుథ్‌రెడ్డి 45, టి.తనూశ్రీ 72, ఎం.నీతుప్రణతి 96వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. జి.మనీష్‌సాత్విక్‌రెడ్డి 106, ఎన్.యాగ్నసిరి 156, గురుచరణ్ 162వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి అభినందించారు.

### ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

**మర్రిగూడ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్యమిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆరోగ్య మిత్రల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యమిత్రల సమస్యల పరిష్కారానికై హైదరాబాద్‌లో నేడు (ఆదివారం) రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు, సమావేశంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కనీసం వేతనం రూ.28వేలు, ఉద్యోగ భద్రత, అర్హతకు తగిన క్యాడర్‌ను కల్పించాలని, విధి నిర్వహణలో మృతిచెందిన మిత్రల కుటుంబాలకు రూ.50 ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

### గెల్లు శ్రీనివాస్‌కు అభినందనలు

**కట్టంగూర్ :** తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గెల్లు శ్రీని వాస్‌యాదవ్‌ను హైదరాబాద్‌లో శనివారం బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కొమ్మనబోయిన సైదులుయాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట సూర్యప్రకాశ్, బింగి మహేష్ పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కేతేపల్లి :** మండల కేంద్రంలో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లకొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్ శనివారం తెలిపారు.

**నార్కట్‌పల్లి :** మండలంలోని గోపలాయపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (ఆదివారం) ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ అధికారి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. గోపలాయపల్లి, నార్కట్‌పల్లి ఇండస్ట్రీయల్ ఏరియా, వట్టిమర్తి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.